# పండగనాటి శాపం

విజయదశమి పండగనాడు జనం హృదయాలు ఆనందంతో పరవళ్ళు త్రొక్కుతున్నాయి.

చీకటిపడిన వీధుల్లో, నృత్యగాన ప్రదర్శన ఊరేగింపులు, గుమిగూడి నడుస్తున్న జనానికి సరదా కలిగిస్తున్నాయి. విద్యుద్దీపాల కాంతుల్లో క్రొత్తదనంతో నడిచే యువతీ యువకులు, పాతదనం స్మృతుల్లో క్రొత్తదనం చూచుకునే వృద్ధులు, పండగనాడు సాయంత్రం హాలులో పరవశత చెందుతున్నారు.

రేడియో పాటలు, వీధి గానాబజానాలు, త్రాగి హుషారుగా తిరిగే పాటకజనం కూతలు, వాహ్యాళికి బయలు

చేరిన కారుల హారను మోతలు, ఏదో శుభం జరిగేనాటి సందడిలా నగరమంతా నిండింది.

వ్యాపారరీత్యా శేఖరానికి ఊపిరాడలేదు, పండగనాడు కూడా. బొంబాయినుంచి వచ్చిన వర్తకునితో సంప్రదించడానికి, తోటి మరొక వ్యాపారితో నూతన పథకాలు గురించి ఆలోచించడానికి, క్రొత్తగా తాను స్థాపించబోయే మిల్లు విషయంలో సరంజామా సంపాదించడానికి, ఉద్యోగులను కలియడానికి, విరామం లేకుండా ఆటో రిక్షాలో తిరుగుతున్నాడు.

ఆటోరిక్షాకు తగిలించిన బంతిపూలదండ- ఆమె ముద్దబంతి వదనంలా- అదే ఆలోచన- అదే రూపు ఎదురుగా కదలుతోంది- మధ్యాహ్నం రెండు గంటలకి యింటినుంచి బయలుదేరిన శేఖరం ఎంత వేగంగా తిరిగినా ఎంతమంది మనుష్యులను కలుసుకుంటున్నా "ఆమె" కనిపిస్తోంది, కంటిముందు, నల్లటిముఖంవ్యాపారి వదనంలో, రిక్షావాడి వదనంలో, వీధులో నడిచే ప్రతీ స్త్రీ వదనంలో, కనిపించి పలకరించిన మిత్రుని వదనంలో- ఏదో ఆమె వదనమే ప్రతిబింబిస్తోంది. తన భ్రమకు ఊహాదృశ్యానికి ఒక్కొక్కసారి తనే ఆశ్చర్యపోయేడు శేఖరం- ఎందుకో ఆమె గురించి అంత ఆలోచన- పిచ్చి- పిచ్చి ఆలోచన- ఆలోచన పిచ్చి- నవ్వుకున్నాడు శేఖరం.

ఏడు గంటలకోసం హృదయం వేగంగా ఎదురు చూస్తోంది. కొట్టుకుంటోంది గడియారంలా.

క్రితంరోజు.

ఉదయమే బయలుదేరి ఎవరో మంత్రి పుంగవుణ్ణి కలుసుకోవలని బయలుదేరాడు. ఒక మిత్రుడుకూడా వస్తా నన్నాడు కాని ఆ మిత్రుడు ఆలస్యం చేశాడు. పండుగ పూజ చేసుకుని మరోగంటలో వస్తానని కబురు పంపాడు. మేజా బల్లవద్దకూర్చుని పత్రికలు తిరగవేస్తున్నాడు.

క్రీంగ్ ... క్రీంగ్ ... క్రీంగ్ ... క్రీంగ్

నా ఉద్యోగం సంగతి ఏం చేశారని ...

రేపు సభలో పాల్గొనగలరా ...

దయచేసి ఒకవ్యాసం మా పత్రికకు పంపరూ ...

సినిమా దర్శకుడు వచ్చాడు, కలుసుకోమంటున్నారు

పనుందట ...

టెలిఫోను అందిస్తోంది సమాచారం

దానికీ మనశ్శాంతిలేనట్లు తెగ మ్రోగుతోంది.

వార్తాపత్రికలో క్రొత్తనటి ... హిందీచిత్రంలో ...

పరిచయం ,.. ఆ బొమ్మ - చకితుడయ్యాడు శేఖరం.

ఆ ముఖం... పోలికలు.. కళ్ళు... నవ్వులు... చాలా వరకు ఆమెలాగే కనిపిస్తొంది,

ఆమె జ్ఞప్తికి వచ్చింది.

సంవత్సరన్నరక్రితం తాను వీడ్కోలు యిచ్చిన—ఆమె తన్ను తిరస్కరించిన ఆమె... తనలో జీవితానికిసరిపడ్డ చిచ్చు పెట్టిన ఆమె... జీవితాంతంవరకు తాను మరచిపోలేని ఆమె.. జ్ఞప్తికి వచ్చింది ... ఎక్కడో ఒక పాపతో, పండగనాడు భర్తతో...హాయిగా కాలక్షేపం చేస్తోంటోంది ... తన హక్కు యింకొకరి చేతుల్లోకి జారిపోయింది... ఒక నిట్టూర్పు విడిచాడు ... ఆమెకు తాను జ్ఞాపకముండడు . . .ఉండవలసిన అగత్యము లేదు ... సంతృప్తిచెందిన మనస్సు ఆమెది... మమ తలు మరిచిపోలేక భగ్నహృదయం బాధల మైకంలో అసం తృప్తితో గడిపే బ్రతుకు తనది — శేఖరం నవ్వు పేలవ మైంది ...

క్రితం సంవత్సరం ఆమె నూతన సంవత్సరం శుభా కాంక్షలు పంపింది . . . ఈ సంవత్సరం పంపదు. కాల ప్రభావం విపరీతం . . . మనస్సుకు రంగు రూపం యిచ్చి పూర్వ పోలికలు లేకుండా చేయగలదు . . . శేఖరం హృద యంలో ఏదో కలత రేగింది.

టెలిఫోను మ్రోగింది.

ఎవరో ముస్లింలాగుంది . . . కౌన్ హై సాబ్ . . . అంటున్నాడు హైదిరియే . . .

ఆగాడు శేఖరం ...

మధురస్వరం ...మృదుమధుర స్వరం ... స్త్రీ కంఠం

"నేను..."

"ఎవరు?"

"జ్ఞాపకంలేనా ... మరిచిపోయారే ... గొంతు గుర్తు పట్టలేరూ?"

"లేదు ... క్షమించండి..."

"నేను..." నవ్వింది ఆమె...పేరు చెప్పింది ...

శేఖరం హృదయంలో గోదావరి, కృష్ణ, కావేరీ, గంగా, యమునా, సరస్వతీ, నదులన్నీ కలిసి కట్టుకుని ఉప్పొంగినట్లయింది—ఆ ఆనందం అనిర్వచనీయం ... ఒక్క క్షణం కంగారు పడిపోయేడు. ఆమె...పలకరిస్తోంది పలకరించదనుకున్న స్త్రీ, మరిచిపోయే ఉంటుందనుకున్న స్త్రీ పలకరిస్తోంది ... శేఖరం ఒళ్ళు పులకరించింది, మిత్రుడివల్ల బయటికి వెళ్ళడంలో ఆలస్యమయినందుకు చాలా సంతోషించాడు.

"చాలా సంతోషం...ఎప్పుడు వచ్చారు . . . ఎక్కడ వుంటున్నారు . . . నిజామాబాదులోనా . . ."

"కాదు . . . కాదు వరంగల్లులో..."

'చాలా సంతోషం...' శేఖరం మనస్సు మత్తులో మార్పులేని మాటలతో చిందులు త్రొక్కింది.

"ఏమిటి...నాకు ఆహ్వానం యివ్వరా...ఏమైంది... నాకు తెలియకుండా అయిపోయిందా" శేఖరానికి అర్థమయింది... తన పెళ్ళికి ఆహ్వానం యిమ్మని...

విచిత్రం!... ఆమె కోరుతుంది తాను ఎవరినో పెళ్ళిచేసుకోమని... అంత ఏవగింపుతో తన్ను దూరం చేసిన స్త్రీ నవ్వుతూ యీ విధంగా ప్రశ్నించడం తనుఒ హేళనచేసినట్లయింది...

"నా మనస్సు అంత చులకనగాదు ... నా భావాలు అంత తేలికగాదు ... నా జీవితం అంత చంచలంకాదు! శేఖరం కంఠస్వరం గద్గదమయ్యింది...

"ఒకసారి కలుసుకో రాదూ!"

శేఖరం గద్గద స్వరంలోంచి ఆనందశ్రుతి దూసుకు వచ్చింది ... కలుసుకోడం ... దర్శనం చేసుకోడం ...

"తప్పక వస్తా!"

"ఎక్కడికి ... మా యింటికి ... రేపు ... పండగ నాడు ఏడుగంటలకు" ఆమె నవ్వింది ... సముద్రతీరంలో

గవ్వలు మ్రోగినట్లు ఆమె నవ్వింది . . . సముద్రతీరంలో కెరటాల నురగలు చిలికినట్లు . . .

మద్రాసులో ఒకనాడు సముద్రతీరంలో ఒంటరిగా కూర్చున్నప్పుడు . . . ఆమె జ్ఞప్తికి వచ్చింది . . . ఆ ఒంటరి జీవితం ప్రక్కనే ఆమెవుంటే . . . యీ బ్రతుకులో స్వర్గం కనిపించేది . . .

ఆటో రిక్షా బుర్రుమంటూ సాగుతోంది . . . చుట్టూ విద్యుద్దీపాలు నృత్యం చేస్తున్నట్లు గిర్రున తిరుగుతున్నాయి ఆవేగంతో . . .

ఏడు దాటింది . . . వ్యాపార విషయాలు పూర్తిచేసు కోవడము ఆలస్యమైపోయింది . . . పోనీ ఆలస్యం . . . ఎందుకు త్వరగా వెళ్ళాలి . . . సరిగ్గా ఏడు గంటలకు ఎందుకు వెళ్ళాలి !... ఆమె తనకోసం తపన పడనప్పుడు. . . తన కెందుకు ఆ వేదన తన బాధచూసి ఆమె నవ్వుకుంటుంది. తన రోదన చూసి లోలోన ఆనందిస్తుంది... ఒక మగ పురుగు తన్ను గురించి విలపిస్తోందని గర్వంగా ఆనందిస్తుంది. ఆమె ముందు తానొక బిక్షుకుడిగా... శేఖరం కనులలో జల ఊరింది... జేబురుమాలుతో తుడుచుకున్నాడు...

ఇంటికివెడితే... బహుశా తనకుపుట్టిన పాపతో ఆడుకుంటుంది... భర్తతో కూర్చుని కబుర్లు చెప్పుకుంటుంది

తానొక ఖైదీగా, నేరస్థుడుగా... యాచకుడుగా ఆమెముందు నిలుచోడం... ఆమె లోలోన వ్యంగ్యంతో, హేళనతో, ఆహ్వానించి, కూర్చోమని కుశలప్రశ్నలు కురిపించి, అతని దీనముఖానికి నవ్వుకుని చివరకు సాగనంపుతుంది-

ఈ బాధ ఎందుకు భరించాలి...

ఈ అవమానం ఎందుకు అనుభవించాలి ...

ఎందుకు ఆమె పిలిచినా వెళ్ళకుండా ఉండలేదు ...

తాను... శేఖరం తర్కించుకున్నాడు ....

ఆటో రిక్షా దిగిన అతని కాళ్ళు అనుకోకుండా ఆ ఆలోచనల్లో ఆమె యింటివైపు నడిచాయి.

వీధి తలుపులు జారవేసివున్నాయి ...

మెల్లిగా తోచుకుని కాంపౌండులో అడుగుపెట్టాడు.

ఒక్క క్షణం తన శరీరాన్ని చూచుకున్నాడు మును, పటికంలె దుస్తులు కొంత అందం అతనికి కనిపిస్తుంది. తాను అందగాడా .... అయితే ఆమె ఎందుకు నిర్లక్ష్యం చేస్తుంది ?

ఇంట్లో వరండాలో ఎవరో పాపను ఆమె ఆడిస్తోంది. చుట్టూ స్త్రీ జనం ... బంధువులు కాబోలు ... ఏమనాలో

తెలియక ... శిక్ష అనుభవించే ఖైదీ న్యాయాధికారి ముందు నిలుచున్నట్లు మౌనంగా నిలుచున్నాడు ఆ కాంపౌండులో...

ఆమెచూసింది

గబుక్కున లేచింది ...

చేతిలోని పాపను ప్రక్క స్త్రీకి అందించింది ...

బిత్తరపోయే చూపులతో విచిత్రంగా ఆహ్వానించింది తన అంతఃపురములోని గదిలోకి ...

ఆమె మౌనం, భీతావహమైనచూపు, శేఖరం నర నరాల్లో అగ్నికణాలు పొదిగినట్లయింది. జీవితంలో పెద్ద పొరపాటు చేసేననుకున్నాడు, ఎందుకు వచ్చానా అని.

గది తలుపులు ఓరగా జార్లవేసింది... ఆమె.

ఆమె వదనంలో ఆనందం తాండవించింది.

"నమస్తే"

నమస్కారబాణం మొహంమీదకు విసిరినట్లు వెక్కిరింతతో నవ్వింది ఆమె.

"క్షేమంగా ఉన్నారా !"

"మీ దయవల్ల"

"నా దయ ఏమిటి? దేవుడి దయ !"

"ఆదే ప్రతీ మనిషిలోనూ దేవుడు ఉంటాడు..."

"మీలో ఉన్న దేవుడి దయ"

"మీలో ఉన్న దేవుడి దయ కాదా ?"

"కాదు... నాలో ఉన్న దేవుడికంటె మీలోఉన్న దేవుడు నాకిష్టం... ఎవరి దేవుడిని వారికిష్టమైన పేరుతో పిలుస్తారు... మీరు నాకిష్టం మీ పేరు నాకు యిష్టం— మీలోని దేవుడు నాకిష్టం... అందుకే మీ దయవల్ల"

"బాగుంది వ్యాఖ్యానం"

"కొంచెం మంచినీళ్ళు యివ్వకూడదూ..."

"అంతఅలసిపోయారా! ఒక మాటమాట్లాడేటప్పటికే!

"కాదు .... తిరిగి తిరిగి వచ్చాను..."

ఆమె గది బయటకు నడిచింది...

ఒకప్పుడు యిదే గదిలో ఆమెకు వివాహం కాక ముందు ఒకసారి కల్సుకున్నాడు, ఆనాడు ఆమెకోసం ఆశించి కలుసుకున్నాడు ... కాని యీనాడు ఆమెమీద ఆశలేక కలుసుకున్నాడు... బ్రతుకు రీతులు విచిత్రం ...

ట్రేలో ఫలహారాలతో ఆమె ప్రత్యక్షమయ్యింది ఒయ్యారంగా ఊగుతూ...చక్రాలాంటి కళ్ళను శేఖరంవైపు శేఖరం మీదకు, త్రిప్పుతూ ... నిండు యౌవనంతో మామిడిపండులా పూర్ణంగా ఆహ్లాదంగా గోధుమ ఎర్రని

సిల్కు చీరలో నిగ నిగలాడే ఆమె...కాశ్మీరు ఆపిలుపండులా శేఖరం శరీరంలో విద్యుత్తు ప్రవహించింది....ఆమెతో దిన దినమూ హాయిగా కలిసి బ్రతుకవలసిన తన బ్రతుకులో ఒక సాయంత్రం కొన్నిగంటల సమయం మాత్రమే మధుర మైంది.

'అయ్యో బోబోయి! యివన్నీ నాకే!" గుండె రాసు కున్నాడు శేఖరం.

"అంత మనిషి ఉన్నారు...ఈ మాత్రం తినలేరూ!"

'ఇవి తింటే ప్రయోజనం'

'కడుపునిండుతుంది'

"నిన్ను చూస్తేనే కడుపు నిండుతుంది"

'నిన్ను చూస్తే నే కడుపునిండి పోయింది గుండెపొంగి పోతోంది. మనసు మైకంతో నీమీదవాలుతోంది!'

'అబ్బో...అబ్బో...ఉపన్యాసమా...కవిత్వమా!'

'రెండూ కాదు...ఈ సన్యాసి జీవితంలో ఒక మాట విన్యాసం!'

ఆమె బాధగా మౌనంగా ఒక క్షణం తలవంచింది

శేఖరం ఫలహారం తినడం ప్రారంభించాడు

జిలేబీ, ఆరటిపళ్ళు, కారాలు, మిఠాయిలు ...

ఆమె మనసులోని ఆప్యాయతల మాధుర్యం, కమ్మదనం, మిళితంచేసి, రూపొందించినట్లు ...

ఒక్కొక్కటి తినడం ప్రారంభించాడు ...

"ఎక్కడ వుంటూంటా...'

"వరంగల్లులో"

" మీకు వుద్యోగంవచ్చిందని మిమ్మలిని కలుసుకున్న ఒక మిత్రుడు చెప్పాడు. అయిదువందలు జీతమట. చాలా సంతోషించాను... కాని ఆ డబ్బంతా నేను తిని నిన్ను అల్లరి పెట్టవలసిన దినాలు పోయాయికదా అని విచారించాను!"

"నేను మీకు జ్ఞాపకం ఉంటానా!" ఆమె నవ్వింది.

"జ్ఞాపకం... హృదయంలో నీ శిల్పం ఒకటి నిలిచిపోయింది. నిన్నుచూడని దినంలేదు నీ పేరు... ఆ నదిపేరు నిత్యమూ పత్రికల్లో ... పొంగుతోందని నువ్వే నిజంగా పొంగుతున్నట్లు కళ్ళముందు కనిపిస్తుంది ...నది పొంగు ఆనందం ఒకరికి యిస్తుంది...నది పొంగిన భీభత్సం నాకు మిగిలింది..." శేఖరం నిట్టూర్చాడు ... తలదించాడు చేతిలో ఉన్న పుస్తకాలకట్ట అందిచ్చాడు...ఇది మీకు బహుమతి

ఈ ఫలహారాలు పెట్టినందుకు

"లేకపోతే యీ బహుమతి యివ్వరా!"

"యివ్వనవలేదు ... ఎలానాయిస్తాను ... ఏదైనా యిస్తాను నువ్వు తీసుకోవాలిగాని!" ...

"పొరపాటున నువ్వు అన్నా!"

"ఫర్వాలేదు ఏదైనా అనవచ్చు ఎప్పుడైనా అనవచ్చు ఎలాగయినా అనవచ్చు ఎందుకయినా అనవచ్చు..." శేఖరం మాటలకు తాళంవేసింది ఆమె.

ఇద్దరూ నవ్వుకున్నారు ...

"యింకా పెళ్ళి చేసుకోలేదా?" నవ్వింది ఆమె వక్రింగా ...

శేఖరం బాధ ఆమెకు ఒక ఆటలావుంది ...

శేఖరం కసితో మూల్గాడు ఆమె మాటకు

ఒక ఆట ఆడాలనుకున్నాడు...

"చేసుకోకేం చేసుకున్నా ... ఆ పుస్తకాల్లో నీకు కావలసిన ఒక ఆహ్వానం వుంది . . నా కూతురు పెళ్ళి ..."

"ఆ!... మీకు కూతురుకూడా వుందా?"

"వుంది ఇది పదవకూతురు ఒకరికి యిచ్చి రేపు పెళ్ళి చేస్తున్నా...నువ్వు రావాలి నా భార్యకు గర్భం...యింట్లో వుంది...నిండుగా ఒకసారి చూడడానికి రారాదూ!"

శేఖరం మాటలకు తబ్బిబ్బైపోయింది ఆమె.

పుస్తకాలకట్ట గబగబా విప్పింది...

అందులో ఆహ్వానం ఒక సభకు ఒక పుస్తక అంకిత మహోత్సవానికి!

నమ్మలేక మళ్ళీ చూసింది... నిజమే!

ఏదో పెద్దభారం దిగినట్లు నవ్వేసింది ఆమె...

"ఊ..." పక పక నవ్వింది ఆమె

"మళ్ళీ నవ్వింది పొట్టపట్టుకుని!

"అయితే మీ భార్య ఎలా వుంటుంది!"

"నిండుగా, పనసపండురంగులో... అందంగా... పెదాలు బిగబెట్టి నవ్వుతుంది... ఆమె డాక్టరు. ఆమె గర్భవతి యిప్పుడు ఎంత ఆప్యాయత ఎంత అభిమానం... జీవితంలో మర్చిపోలేను... ఒకసారి యింటికివస్తే, చూపిస్తాను... ఆమెను చూస్తోంటే తన్మయత .."

ఆనందంగా ఉన్న శేఖరం వదనం ఒక్కసారిగా హఠాత్తుగా కుంచించుకుపోయింది. కంఠం గద్గద మయ్యింది... తన ఊహాగానం కృత్రిమ ఊహాగానం తల్చుకుని అతని కన్నీరు వేడిగా బుగ్గలమీద కారింది.

ఆమె చూసింది.

'దయ యుంచి. మనస్సు నొప్పించినందుకు క్షమించండి'

"ఇంతకంటె నా బ్రతుకులో... మిగిలిందేముంది ... ఊహాగానం తప్ప..."

"ఎందుకు మీకింత పిచ్చి? నేను ఒక సామాన్యమైన మనిషిని"

"అవును... సామాన్యమైన మనిషివేనని నాకూ తెలుసు ...కాని నా భావాలు నీ కర్థంకావు. నాకు ఎందుకో నీ మీద అభిమానం కలసింది. జీవితంలో ఒకే ఒకసారి. అది మారదు. నిన్ను చూస్తే, నీ మాట వింటే. నిన్ను తల్చుకుంటే, నరాలు పొంగుతాయి, రక్తం ఉధృతంగా పారుతుంది. శరీరమంతా ఏదో బాధతో కాలిపోతుంది- తల దిమ్మెక్కుతుంది... చివరికి పిచ్చి ఎక్కినట్లవుతుంది... ఈ బాధ తగ్గడానికి ఏదైనా మందియ్యి డాక్టర్... లేదా... విషం యిచ్చి చంపేయ్...

శేఖరం ముఖం ఎర్రబారింది... ఉద్రేకం తగ్గించుకున్నాడు శేఖరం...

"పోనీ !... అదంతా గతం... తల్చుకుంటే ప్రయోజనంలేదు... ఎలా వుంది నీ ఉద్యోగం ?... ఎంతమంది రోగులను చంపేవు !" నవ్వేడు శేఖరం...

"నా చేతిలో ఎవరూ చావలేదు... మీరు కూడా అంతే !"

'అందరు రోగులకూ ఆరోగ్యమిచ్చి ఆనందమిస్తావు... ఈ రోగికి ఆరోగ్యమిచ్చి బాధ యిస్తావు !'

"నిజంగా మిమ్మల్ని పిచ్చె ఆస్పత్రిలో చేర్చనా ?"

"చేర్చు నన్ను టాక్సీలో వేసుకుని ఆస్పత్రికి తీసుకు వెళ్ళు పిచ్చివాడు ఎవరిమాట వినడు అల్లరి చేస్తాడు గంతులు వేస్తాడు అదుపులో ఉండడు అయినా ఆ ప్రయత్నం చెయ్యి దారిలో నేను టాక్సీవాడి పీక పిసికి, కారు డ్రైవ్ చేసి ఎక్కడ కైనా తీసుకుపోతే నన్నేమీ అనకు నేను పిచ్చివాణ్ణి కనుక డాక్టర్ ...యీ పిచ్చివాడు నీ అదుపు ఆజ్ఞల్లో ఉంటాడు... ఎలా ఉండమంటే అలా!"

దీనంగా శేఖరం నవ్వేడు...

"బాగుంది... వరుస, ఆ ఫలహారాలు తినండి... నా కేసి చూస్తారేమిటి ?"

"నాకు ఆ ఫలహారాలు అక్కర్లేదు"

"మరి ఏంకావాలి ?"

"నిన్నె తినెయ్యాలని ఉంది !"

ఆమె నవ్వింది...సొగసుగా నవ్వింది. ఆమె కళ్ళల్లో వెయ్యి చంద్రబింబాలు వెలిగాయి... ఆ ఆనందం పైకి చెప్పలేక, ముఖం సిగ్గుతో ప్రక్కకు త్రిప్పుకుంది— ఆమె త్రిప్పుకున్న ముఖం ఎదుట బుద్ధుడిబొమ్మ నిశ్చల ధ్యానంలో కనిపించింది శేఖరానికి,

'అలా కారాదూ?' అడిగింది ఆమె బుద్ధునిచూపి
'అంతకంటె ఎలావున్నా...'
బుద్ధుడివైపు చూశాడు శేఖరం
అహింసా పరమోధర్మః- చెవుల్లో గింగురుమంది.
కాని ఆమెను తినేస్తానన్నాడు...

ఆమె పనసపండువంటి శరీరంలో ఒక్కొక్క పెచ్చు... మాంసం పెచ్చు భుజిస్తున్నట్లు... ఆమె ఒళ్ళంతా కాట్లు వేస్తున్నట్లు... పరవశతతో మైకంతో ఆమె శరీరాన్ని హస్తాలమధ్య బంధించి పీల్చి పిండుతున్నట్లు... ఆ బుద్ధదేవుడు ముందు ఆ జీవహింస... బ్రతుకులోని వైచిత్ర్యం అంతా అక్కడే గోచరించింది... ఒకరోజు బుద్ధవిగ్రహం క్రింద హోటల్లో బిర్యానీ తిన్న దృశ్యం జ్ఞప్తికి వచ్చింది-ఆ గదిలో మరోవైపు ఉమర్‌ఖయాయ్ పుస్తకం వ్రాసుకుంటూ- చిన్నదీపం- మత్తుపానీయం-- దృశ్యం... గోచరించింది.. ఉమర్ జీవితంలోని మత్తు, శేఖరం భగ్నహృదయంలో చేరి బరువెక్కించింది,

ఒకక్షణం శేఖరం, ఆమె... మెరిసిపోయే కళ్ళల్లో.
కళ్ళచూపుల్లో—చూపుల వెలుగుల్లో
దూరదూరంగా—గాలిలో— హత్తుకుపోయారు.
ఆమె నిట్టూర్పు విడిచింది.
శేఖరం బరువుగా నిట్టూర్చాడు,

'ఉద్యోగం చేస్తున్నారా?' ప్రశ్నించింది ఆమె.

'ఆ చేస్తున్నా. ప్రస్తుతం ... ప్రమోషనులు వది లేశాను...

నగరందాటకూడదని... ఉద్యోగమే త్వరలో వది లేస్తున్నాను!

'మరి యింకేం చేస్తారు!'

'వ్యాపారం?'

'ఏం వ్యాపారం?'

'బియ్యపు ఎగుమతి, సబ్బుల వ్యాపారం!'

'అబ్బో? మాకు ఉచితంగా విరివిగా దొరుకుతా యన్నమాట ఆరెండూ, మీరు వ్యాపారం పెట్టాక!'

'చూద్దాం!'

'ఊహుఁ... ఎక్కడైనా బావకాని, వంగతోటవద్ద కాదన్నమాట!' బలేబావ!'

'ఎవరు ... నేనా?'

'మిమ్మల్నెందుకంటాను... అదొక సామెత!

'నీ ఉద్యోగం ఎలావుంది?' శేఖరం ఎదురు ప్రశ్న వేశాడు.

'ఏముంది... రాత్రింపగళ్ళు రోగులసేవ...

మానవసేవ... ఆస్పత్రిలోనే నివాసం...

బయటి ప్రపంచంతో పరిచయం తక్కువ—

నేను డాక్టరేట్ చదవాలనుకుంటున్నాను!

'ఎక్కడ?'

'ఏమిటా గదమాయింపు, లాయరు క్రాస్ ఎగ్జామిన్ చేసినట్లు!'

నవ్వేశాడు శేఖరం

"ఈ వూళ్ళోనే"

"ఎప్పటినుంచి"

"అదిగో మళ్ళీ అదేధోరణి! -- యిక్కడే -- యింక యిక్కడే వుండిపోతా!"

"అయితే రోజూ కనిపిస్తావన్నమాట!"

"ఓహో అంతవరకూ వచ్చింది - పరాయిస్త్రీ పరిచయం!"

చెంపమీద చరిచినట్లయింది శేఖరానికి.

ఆమె తమ్ముడు పాపతో ప్రత్యక్షమయ్యాడు.

అందమైన పాప- వంకీలు తిరిగిన చిన్నజుట్టు. తప్పటడుగులతో- బోసినోటితో- బూరిబుగ్గలతో- అందమైన వదనం—సరిగ్గా ఆమె పోలికలే! శేఖరం కొంచెం చిన్నబోయేడు.

"నీ పాప అనుకుంటా!"

"కాదు- నా తమ్ముడుబిడ్డ!"

"అబద్ధం"

"నిజం"

"పోలికలన్నీ నీవే—ముక్కు— నోరు— ముఖం — కళ్ళు అన్నీ— కాదని ఎందుకు బొంకు?"

"ఏమిటీ డబాయింపు!" ముఖం చిట్లించింది ఆమె.

"కాదా?" నసిగేడు శేఖరం.

"అప్పుడే పిల్లలా?"

"ఏడాదిన్నరలో యిద్దరు పుట్టవచ్చు!"

"ఆహా! అలానా మీరే వైద్యం నేర్చుకుంటే— మంత్రసాని పనితనం చేశాలా వున్నారే!"

శేఖరం పకపక నవ్వేశాడు—

శేఖరం పుట్టుక గురించి కథ జ్ఞప్తికివచ్చింది- తన తల్లి ప్రసవవేదన పడింది ఒకరోజు— ఎంతకూ తాను జన్మించ లేదు—మంత్రసాని వుండి వుండి విసిగి వెళ్ళిపోయిందట ! మర్నాడు హఠాత్తుగా నడుస్తోంటే తల్లి తనుకన్నది— నేలమీది రోలుగుంటలో తాను పడ్డాడట— తలకు పుట్ట గానే చిన్న బొప్పిగట్టింది—జీవితంలో అన్నీ బొప్పిలే!

ఆ కథవిన్న ఆమె నవ్వుతుంది—

"అప్పుడే చచ్చిపోయివుంటే బాగుండేది!"

"చాల్లెండి— ఏమిటా మాటలు!" ఆమె కసిరింది.

చేతిలో మిఠాయి కలిపి తినమంది.

నోరు అందించాడు శేఖరం.

ఆమె నోట్లోకి విసిరింది...మిఠాయి!

"వేళ్ళతో అందిస్తే ఏమయ్యేదో ?"

"పాపం ! వేళ్ళు మీ సొంత సొత్తు!"

"కాదూ ! మిఠాయికంటె అవే తీపిగా ఉంటాయి !"

"ఏం... నేనేం చక్కెర ఎక్కువ తింటున్నాననుకున్నారా !"

నవ్వుకున్నాడు శేఖరం ఆనందంగా.

నవ్వేశాడు శేఖరం హాయిగా...

మరుక్షణంలో బాధ... యీ సాన్నిహిత్యం క్షణికం మరికొద్ది సేపటిలో యిదంతా కలగామారిపోతుంది తానెక్కడుంటాడో... ఆమె ఎక్కడుంటుందో!

"డాక్టర్ ? నా జీవితంమీద నాకే కసిపెరిగిపోతోంది నాజీవితంలో ఏదైనా ఘోరమైన పనిచెయ్యాలనుకుంటున్నా హత్య !"

"నన్నే చెయ్యండి... పీడ విరగడౌతుంది"

"నిన్నెందుకు చెయ్యాలి... నీ జీవితం నీకు హాయి !"

"పెళ్ళైనవాళ్ళంతా హాయిగా ఉన్నారని మీలాంటి పిచ్చివాళ్ళు అనుకోరూ మరి !"

"చిన్నప్పుడు నాకు జబ్బు చేసింది... మూడురోజులు వీధిలో వుంచారట ! చచ్చిపోతానని... ఎగశ్వాస దిగశ్వాస

ఒక పెద్ద సంఘర్షణ... అందరూ ఆశ పోగొట్టుకున్నారు... మా నాయనమ్మ ఆశపడి డాక్టరిని ఆఖరుసారిగా ఏదైనా మందిమ్మంది. ఆయన విసిగెత్తి ఒక సీతాంశురసం పడేశాడు అది శరీరానికి వేడి నిచ్చింది... తర్వాత ప్రాణమే యిచ్చింది. యీ బ్రతికిన బ్రతుకంతా యీ బాధకోసం డాక్టర్"

బాధగా తలదించుకుంది ఆమె.

"డాక్టర్! నన్ను ఒక అభాగ్యుడనుకున్నావు...విలాస పురుషుడని నమ్మావు... నిన్ను పెళ్ళిచేసుకోకుండా వెంట బడిన రోమియో అనుకున్నావు...నీకు భర్తగా తగనిమూర్ఖుడ ననుకున్నావు...అంతేనా!" అరిచాడు శేఖరం కోపంతో

ఆమె దీనంగా ముఖం పెట్టింది.

"డాక్టర్! అవన్నీ నిజం కాదని చూపిస్తా... నాధనం వెదజల్లుతా... నా గౌరవాలు పదవులు చూపిస్తా... నీ కళ్ళ ముందే కిరీటంతో తులతూగుతా! నువ్వు బాధపడి హింసపడి పెళ్ళిచేసుకోనందుకు పశ్చాత్తాపపడి కుళ్ళి కృశించేదాకా!"

ఆమె కన్నీరు కార్చింది!

"డాక్టర్! నా మూలాన నీకెందుకు యీ కన్నీరు.... క్షమించు... యీ జన్మలో యింక మనం భార్యాభర్తలం కాలేము... కాని నేను పెళ్ళిచేసుకోను.... నీకోసం తపిస్తా... తపనతో నశిస్తా... నాశంతో చస్తా చస్తో కోరుకుంటా ... వచ్చే జన్మలోనైనా నువ్వే నా భార్య కావాలని!"

శేఖరం కంఠం గద్గదమయ్యింది... కన్నీరు ఉబికి కోటుమీదకు తొణికింది—

తలుపు చప్పుడయింది . . .

పాప క్రింద కూర్చుని ఆడుకుంటోంది... నీళ్ళగ్లాసు ఒలక పోసింది- ఆ నీటితో శేఖరం పట్లాం చివరలు తడిసాయి.

బాధలనుంచి తేరుకుని స్పృహకు వచ్చిన శేఖరం ఆ బట్టల తడిగమనించాడు.

తలుపు వెనుకనుంచి కాఫీ అందిచ్చాడు ఆమె తమ్ముడు

"అరెరే! పాప! . . . ఏమిటే యీ నీళ్లు ... అతిథులకు సరిగానే మర్యాద చేస్తున్నావే!"

పాప నెత్తుకున్నాడు శేఖరం.

ముద్దుపెట్టుకున్నాడు...

'ఈపాప ఎంత అందంగా వుంది... నే దొంగిలించేస్తా'

"తీసుకోండి!"

"అల్లాకాదు డాక్టర్! నీకు పుట్టిన బిడ్డల్లో ఒకరిని నాకు దత్తత కియ్యి... ఆ బిడ్డను చూస్తూ నిన్ను స్మరించు కుంటా—

"అంత అదృష్టమా!..."

"ఏం?"

"నేను దురదృష్టవంతురాలను!" ఆమె కంఠం గద్గద మయ్యింది.

"నీ పిల్లను నాకు దత్తత యిస్తేనా ?"

అతని భాషణలోని వైచిత్ర్యానికి ఆమె నవ్వేసింది. ఫలహారాలు పూర్తి అయ్యాయి"

"డాక్టర్ ! యిలా రాత్రి పిలిస్తే ముఖ్యంగా పండగ నాడు భోజనం పెడతావనుకున్నా కాని యిలా చవకగా పంపిస్తా వనుకోలేదు... నువ్వు నాకు ఒక పెద్ద డిన్నరు బాకీ!

"పెళ్ళి డిన్నరుకు రావలసినది" అది చాలా బాగుంది!

"ఎలా రాను డాక్టర్ ! నవ్వితే పదిమందిలో నవ్వమని, ఏడుస్తే ఒంటరిగా ఏడ్వమని సామెత... నా స్థితి నీకు తెలియం దేముంది ? నీ ఆనందం నేనెందుకు చెరచాలి ?"

శేఖరం ఖిన్నుడయ్యాడు ఒక క్షణం...

"ఇలా ఎప్పుడో కలుసుకుంటాం... ఒక్కొక్కసారి యింక కలుసుకోలేకపోవచ్చు... నేను వ్యాపారంలో పడితే ఎన్నో ఊళ్ళు తిరగాలి... నువ్వు వచ్చి ఫోన్ మోగించినా బహుశా నా చెవులు వినేయోగంపడదు. నేను కలుసుకో లేకపోవచ్చు... అందుకూ అదృష్టముండొద్దా !"

"మరే వూరు వెడుతున్నారూ... నేనా త్వరలో సిలన్ వెడుతున్నా !" నవ్వింది ఆమె.

"నన్ను కూడా తీసుకు వెళ్లకూడదూ— నీమందులబాగ్— నీ బట్టలపెట్టే నేను మోసుకొస్తాను!"

"ఛీ—అదేం మాటలు—మీరు ఏవూరు వెడతారు?

"బొంబాయి"

"నాకేం తెస్తారు?- పెళ్ళినాడు మీరిచ్చిన కానుకలు నాకు అన్నిటికంటే బాగా నచ్చాయి!"

శేఖరం ఆశ్చర్యపోయాడు—అలా ఆమె అడుగుతుందని నమ్మలేదు.

"నువ్వు యిలా అడగడం భార్యగా వున్నప్పుడు అయితే ఎంత బాగుండేది, .. ఏదైనా తెచ్చేవాడిని— యిచ్చేవాడిని— నా సర్వస్వం యిస్తా— నువ్వు తీసుకుంటే రోజుకొక పార్సెలు నీ చేతుల్లో వుంటుంది— నా హృదయం నీ పాదాలదగ్గర నృత్యం చేస్తుంది—నిన్ను ఏ పరిస్థితుల్లోనైనా ఎప్పుడైనా ముసలితనంలోనైనా తీసుకోడానికి సిద్ధం డాక్టర్!"

ఆమె కడుపుబ్బ కమ్మగా నవ్వింది.

"బలేపిచ్చి!"

శేఖరం ఆమెను చూసి నవ్వాడు.

"ఇదిగో, నా పెళ్ళినాటి ఫోటోలు చూడండి—"

"పెట్టె తీసి ఆల్బమ్ చూపింది ఆమె- రండి చూడండి (ఆమె జడలోని చామంతిపూలు చిలిపికళ్ళ నవ్వాయి.) కుర్చీలోంచి లేచాడు—

చేతుల్లో పెట్టుకున్న ఆల్బమ్ శేఖరం తీసుకోబోయాడు.

"కాదు యిలాగే—చూడండి!"

"ఆ బొమ్మలు బాగులేవు—నీ అందమైన వదనం ముందు—ప్రత్యక్షంగా అప్సరస కనిపిస్తోంటే—పరోక్షమైన బొమ్మలు నా కెందుకు."

శేఖరం వేడినిట్టూర్పు ఆమె వదనంలోకీ దూసుకుపోయింది. ఆమె మధురకంఠం ఏదోమాటతో ఆగిపోయింది, శేఖరం వదనం ఆమె వదనానికి హత్తుకుపోయింది ఒకక్షణం.

"ఏమిటాఅల్లరి—అటు కూర్చోండి!"

"అమ్మాయీ!" ఇంట్లోంచి పిలుపు వినిపించింది—ఆమె అదిరిపడింది.

శేఖరం గడియారం పదిన్నర దాటింది— శరీరంనిండా ఏదో అగ్ని ప్రజ్వరిల్లినట్లయింది ఆమె సిందూరతిలకం అంటించిన మంటలు ఒళ్ళంతా దావానలంగా అల్లుకుంది—ఏవో అగ్నిపర్వతాలు హృదయంలో బ్రద్దలౌతున్నాయి.

క్షణకాలం స్పృహతప్పి నిలుచున్నాడు శేఖరం.

"ఇంక వెడతాను—నేనింకా యిక్కడవుంటే- నాకూ నీకూ కూడా శాంతి ఉండదు!"

ఆమె ఫొటో ఒకటి ఆల్బంనుంచి రాలింది.

అది తీసుకుని జేబులో పెట్టుకున్నాడు శేఖరం.

"దయయుంచి-అది తీసుకోవద్దు—నా కిచ్చెయ్యరూ!"

"ఎందుకు!"

"దయతో—" మారాము చేసింది ఆమె.

"మీతో యింక మాట్లాడను-" శపథం పట్టింది ఆమె నవ్వుతూ.

"శనివారం మాయింటికివస్తే—యిది యిస్తా"

"నేను వస్తా—అది యిస్తే-"

"యిస్తే-వస్తా—" మననం చేసుకుంటూ శేఖరం బయటికి నడిచాడు.

అడ్డుపెట్టిన ఆమె చేతివ్రేళ్లు కొరికాడు కసిగా--

పూర్తిగా పిచ్చి ఎక్కిన వాడిలా వెర్రిచూపుతో వీధి లోకి వచ్చాడు.

ఆమె తచ్చాడుతూ కాంపౌండులోంచి వీడ్కోలు యిచ్చింది చూపులతో.

వీధి నిర్మానుష్యంగా వుంది.

మశూచిచేవేడెక్కి- చీదరగా కురుపులతో ఛిద్రమయిన శరీరంలా మారిన అతని దేహానికి వీధిలోని వేపచెట్లు కొంచెం ఉపశమనానికి వీవన విసిరాయి.

"డాక్టర్ !"

శేఖరం కుమిలేడు... వెక్కి వెక్కి ఒంటరిగా నడుస్తూ ఏడ్చాడు.

ఇటువంటి బాధ ఎటువంటి గర్భవిరోధికికూడా రావద్దు భగవంతుడా!" అరిచాడు శేఖరం ఆ అరుపు అతనిలోనే అణగిపోయింది.

వేపచెట్టు నీడలో నిలుచుని స్రానుకు తలకొట్టు కున్నాడు. తల బొప్పికట్టింది. తలనొప్పి పెరిగింది.

ఏవో నీడలు దెయ్యాల్లా కదిలాయి. బరువుగా శేఖరాన్ని ఆవరించాయి. ఒళ్ళంతా బరువెక్కి పోయింది. స్పృహ తప్పిన తనశరీరం రిక్షాలో వేశాడు శేఖరం.

"శనివారం ఆమె రాదు" అనుకున్నాడు... మరోసారి "రావచ్చు" అనుకున్నాడు.

త్రాగిన కార్మికుడు పాడుతూ పోతున్నాడు.

నిను మరవలేనె ఎంకి

నా తోటె ఉండు ఎంకి

నను మరిచిపోకె ఎంకి

నా బతుకు యింతే ఎంకి.

అతనికీ శేఖరానికీ ఏమిటి భేదం... ఎవరి మత్తులో వారు తూలి కూలిపోయేరు.

ఎన్నో శనివారాలు గడిచాయి.

జీవితంలో బాధ ఒకటే శనిలాగ మిలిగింది.

ఎవరిని ఏ జన్మలో పెట్టిన శాపమో తన్ను చుట్టింది అనుకున్నాడు శేఖరం.

పండగనాడు ఆమె చూపిన అనురాగం శేఖరం బ్రతుకంతకీ ఒక బాధల శాపం"గా మారింది.